
# అలానందలహరి

సుంకర వి. హనుమంతరావ్

**'హండ్రెడ్'... ఆ ఒకే ఒక్క 'గావుకేక'**
**ఆ ఆరుపోర్షన్ల ప్రశాంతి నిలయంలో**
**బాంబ్ బ్లాస్టంత ఎఫెక్టునిచ్చింది! కారణం?**
**ఆరోజు క్రికెట్ మేచ్ కూడా లేకపోవడం!**

అందుకే పదిన్నరకే పక్కలు సర్దేసుకున్న అయిదు పోర్షన్ల జనాలతోబాటు ఆ గావుకేకకు కాపీరైటు హోల్డరయిన 'అల' అని పిలిపించుకునే అనంతలక్ష్మి భర్తయినటువంటి ఆనందరావు కూడా గాఢనిద్రలోంచి బయటపడి - ఉలికిపడి .. భయపడి లేచి కూర్చుని కళ్ళిప్పాడు.

కళ్లిప్పిన ఆనందరావుకు హారర్ సిని



మాల్లో కత్తి పట్టుకుని కసిగా పొడవడానికి సిద్ధంగా వున్న దెయ్యంలా తెల్లని నైటీలో, విడిపోయి ఫ్యాన్ గాలికి ఊగుతున్న నల్లని కురులతో చైనామేడ్ థర్మామీటర్ని తదేకంగా చూస్తూ దర్శనమిచ్చింది 'స్వంత ధర్మపత్ని' అనంతలక్ష్మి మసగ్గా వున్న బెడ్‌ల్యాంప్ వెలుతుర్లో.

కన్‌ఫర్మేషన్ కోసమై కళ్లజోడుకోసం.. వేగంగా కదిలిన ఆనందరావుకు రాహా కంపెనీ వారి స్ప్రింగ్ బెడ్ సైకాలజీ పూర్తిగా అర్థంకాకపోవడంతో - జర్రున జారిపోయి.. దబ్బుమనే శబ్దం చేస్తూ బోదెలో పడిన తాటిపండులా - గోడకూ మంచానికీ మధ్య పడిపోయాడు - ఆలపతి .. సారీ .. ... ఆనందరావు - ఆ పడిపోవడంలో తన చంకల్లోంచి జారిపోయి .. మంచం కిందకు దొర్లిపోయిన కడప బాంబుల్లాంటి 'ఆ రెండు గుండ్రని ఘనపదార్థాలను' కూడా గమనించలేకపోయాడు.

తన స్థితిని... పరిస్థితిని కూడా కేర్ చేయకుండా - వీరనారిలా జుట్టు ముడేసి ... అంజూజార్జి బాబీలా మంచంమీద నుంచి ఒకేఒక్క గెంతులో డోర్ ముందు ల్యాండైపోయి బయటకు దూసుకుపోతున్న తన స్వంత భార్యను - బంతిని వికెట్స్ మీదకు కొట్టుకుని అవుటైపోయిన పఠాన్ ... బంతిని చూసినట్లు తెల్లముఖం వేసుకుని చూశాడు నడ్డి నట్టు టైటయిపోయిన ఆనందరావు.

అలా దూసుకుపోయిన 'అల' పెంట్‌హౌస్ వైపుకు మోము సారించి 'బామ్మగారూ' అంటూ ఆడ టార్జాన్ లెవెల్లో ఓ అరుపు అరిచేసింది.

'హండ్రెడ్' అనే గావుకేకతోనే విషయాన్నంతా ఔపోసన పట్టేసిన సదరు బామ్మ సుందరమ్మ గునగునమంటూ మెట్లు దిగొచ్చి, అల ముఖాన్ని వ్యూహంపన్నిన గ్రేగ్ చాపెల్ - ద్రావిడ్‌ను చూసినట్లు చూస్తూ ... అయితే మన ప్లాన్ 'పారిందా?' అంది.

తన్నుకొస్తున్న ఆనంద భాష్పాల్ని అతికష్టంమీద ఆపుకుంటూ - 'అంతా మీ దయ' అంటూ ఎమోషనల్‌గా పాదాభివందనం పట్టబోతే, అదేదో హిందీ సీరియల్ 'సాసో... జామో'లోలా భుజాలు పట్టుకుని ఆపేసి ... గట్టిగా కౌగిలించుకుంది - అలను .. బామ్మ సుందరమ్మ.

అప్పటికే అన్ని పోర్షన్ల లైట్లూ వెలిగిపోయాయి!

కలుగుల్లోంచి బయటపడిన 'జీవాల్లా' ఆ ఇరుకు గదుల పోర్షన్స్‌లోంచి బయటికొచ్చేశారు 'బామ్మగారి టెనెంట్స్'!

'ఏమయిందే అలా? అలా అరిచింది నువ్వేనా?' అందరికంటే ముందు అడిగింది వర్ధమాన లేఖారచయిత్రి అనే ముద్రనుండి వర్ధమాన కథా ఆర్ నవలా రచయిత్రి అనే ముద్రకోసం ముప్పతిప్పలు పడుతున్న ముప్ఫైవర్షాల కుమారి శ్రీమతి.

వాటేపెండ్? అంటూ డ్యూటీ డ్రెస్ విప్పకుండానే ఎంటరైపోయింది... సిస్టర్ మేరీ క్యూరీ!

ఆమె వెనుకే... వాస్తు విద్వాన్ కం ఆరెంపీ అర్నాద్, అతని భార్య రేవతితోబాటు 'ఆఆఇఈ' అని పిలువబడే ఆయుర్వేద ఆచారి ఇప్పపూవు ఈశ్వరరావు తన ధర్మపత్ని గాయత్రితో దిగిపోయాడు. మందుల సెలక్షన్స్‌లో మహాజ్ఞాని అని అనిపించుకునే హోమియో డాక్టర్ యోగానంద్ గ్రౌండ్‌ఫ్లోర్ నుండి పైకి రావడానికి.. కించిత్తు టైం ఎక్కువ తీసుకున్నాడు.

ఆనందరావుకు... హండ్రెడ్ ఫీవర్!

ఫోర్త్ అంపైర్ కార్యక్రమంలో ... సచిన్ హండ్రెడ్ నాటౌట్? అంటూ పళ్లన్నీ బయటపెట్టే మందిరమ్మలా బామ్మ సుందరమ్మ అనౌన్స్ చేసింది.

అంతే .. ఉండేలు దెబ్బకు ఎగిరిపోయిన కాకుల్లా ఎగిరిపోయారు వైద్యత్రయం.

'అయ్యో.. అయ్యయ్యో! ఆనందరావుకు హండ్రెడ్ ఫీవరా?' అనుకుంటూ .. అలను నెట్టేసుకుంటూ హాజరైపోయారు అతివలంతా.

మగతగా కళ్లు మూసుకుని 'సీన్ని' అర్థం చేసుకోవాలనే వ్యర్థ ప్రయత్నంలో వున్న ఆనందరావు అంతమంది ఆడంగుల్ని హఠాత్తుగా చూసి భయపడిపోయి ... మళ్లీ దబ్బుమనే శబ్దాన్ని క్రియేట్ చేసే ప్రయత్నం చేయబోతే - ఒక్క జంప్‌తో మంచం పక్కకు చేరిపోయిన 'కుమారి శ్రీమతి' అతనికా అవకాశాన్ని దక్కకుండా చేసి - మంచంమీద సెటిలైపోయి ... కళ్లు పరీక్షించాలనే నెపంతో తన భారీ అందాల్ని ఆనందరావు గుండెలకానించి .. ముఖంలో ముఖం పెట్టేసింది.

అలా ఓ నిమిషం చూసి .. ఆనందరావుకు మాత్రమే కన్పించేలా కన్నుకొట్టి... అలవంక తిరిగి 'ఏమే అలా? ఆ వంకతో ఆనంద్ గార్ని పస్తులుంచేస్తున్నావా ఏంటి? నేనా మధ్య రాయబోయిన కథలోని హీరోకొచ్చిన రొమాంటిక్ ఫీవర్లా వుంది' అంది కుమారి శ్రీమతి.

ఆ సీన్ అప్పుడు గాక మరెప్పుడు చూసినా ... రోకలిబండ తిరగేయగల సామర్థ్యమున్న అల .. నషాళానికంటిన కోపాన్ని కక్కలేక మింగలేక - పిచ్చినవ్వుగా 'కక్కేసింది'!

రొమాంటిక్ ఫీవర్‌లోని రెండో మాట చెవులపడగానే తనకిప్పుడు హండ్రెడ్ ఫీవరుందనీ - దాని తాలూకు యాడ్ కాంపైన్ చేసిన అల యొక్క కేపబిలిటీకి నిదర్శనమే ఈ సీన్ అనే విషయం అర్థం చేసుకున్న ఆనందరావు - టచ్ అవుతున్న కుమారి శ్రీమతి 'టచింగ్స్'ను ఆస్వాదించాలో - శవం చుట్టూ మూగినట్లున్న ఇరుగూ పొరుగు జనాల్ని చూసి ఏడ్వాలో అర్థంగాక ఆదుకోవే అలా! అనే అర్థంవచ్చేట్లు చూశాడు. పాపం... ఆ ఆఖరి చూపు కూడా అందనంత దూరంలో వుంది అల అప్పటికే!


అల అప్పటికే బామ్మతో కలిసి కిచెన్‌లో దూరిపోయి అది వుంటే యిది లేదనకుండా - మూడు గుణాల టీని మురిపెంగా చేస్తూ... బామ్మతో గుసగుసలాడేస్తోంది.

ఇక్కడ - ఆ బిల్డింగ్‌లోని ఆడామగా - పిల్లాజెల్లా - అంతా తన మెడికల్ నాలెడ్జికి - ఫ్రీ శాంపుల్స్‌కు నీరాజనాలు పలుకుతున్నా - తన మందుల్నే కాదు - ముందూవెనుకల్ని కూడా 'ఆనంతరావు' కేర్ చేయడం లేదనే మహత్తర విషయాన్ని... తన అంతరాత్మ అద్దంలో కనపడి హెచ్చరించినప్పటి నుండీ, అవకాశంకోసం ఎదురుచూస్తున్న మలయాళీ కుట్టి సిస్టర్ మేరీక్యూరి ... వెంటనే రియాక్టయిపోయి ఫెవికాల్లా అంటుకుపోయిన కుమారి శ్రీమతిని అవలీలగా పక్కకు లాగి - పక్క జేబులో వున్న థర్మామీటరు తీసి అదో స్టైల్లో విదిలించి... ఆనందరావు నోట్లో దోపేసి - ఒక చేత్తో నాడిని - రెండోచేత్తో గుండెను టెస్ట్ చేయడంలో మునిగిపోయింది.

'టెస్టే' అయితే ప్రాబ్లమే లేదు.

చొక్కా కిందుగా... గుండెల మీదకు పాకించిన చేత్తో .. ఏపుగా పెరిగిన ఆనందరావు ఎద వెంట్రుకల్ని మెలిపెట్టి పీకేసింది.

కెవ్‌మనాలో? కేకపెట్టాలో అర్థంకాని ఆనందరావు కేరళ బోండాల్ని సూపర్ క్లోజప్‌లో జూస్తూ 'గిలగిలా - విలవిలా - మిలమిలా' అయిపోయాడు - కన్ను... సారీ ...కళ్లు మూసేశాడు.



అల ట్రేతో రావడం క్రీగంట గమనించిన మేరీ క్యూరీ తన రెండు చేతుల్ని ఉపసంహరించేసి – నోట్లోంచి థర్మామీటర్లు సర్రున లాగేసింది. మరో మూమెంటుకు అవకాశం యివ్వకుండా రెండో జేబులో వున్న డిస్పోజబుల్ సిరెంజిలోకి మందెక్కించి – తన కసితీరా కసుక్కున పొడిచేసింది.

జీవితంలో మొదటిసారిగా పడిన ఆ సిరెంజి పోటుకు అమ్మా అంటూ నోరు తెరిచేశాడు ఆనంద రావు.

అప్పుడే – పసరు గ్లాసుతో వచ్చిన ఈశ్వర్రావు...

'వద్దండీ!' అంటూ ఆనందరావు మీదున్న అభిమానంతో వారిస్తున్న తన భార్య మాటను వినకుండా – 'మూస్తే మళ్లీ తెరవడం కష్టం' అని గొణుక్కుంటూ గ్లాసుడు పసరునూ ఒకే ఒక గుక్కలో మింగేలా చేశాడు. అప్పుడే తన హోమియో కిట్‌తో వచ్చిన యోగానంద్ వంక తిరస్కారంగా చూస్తూ... మోర పైకెత్తి మెట్లు దిగుతూ .. కాలుజారి కడ మెట్టు దగ్గర ల్యాండైపోయాడు.

లేచి .. అటూయిటూ చూసి – 'బతికింది రాబర్ట్' అనుకుంటూ బర్డ్‌ఫ్లూ తగిలిన కోడిలా కుంటుకుంటూ యింట్లోకి దూరిపోయాడు.

హోమియో డాక్టర్ యోగానంద్ ఏవేవో మాత్రలు ఇంజన్లో బొగ్గేస్తున్నట్టు తోసేస్తుంటే – చేతిలో కంపాస్ పట్టుకుని ఆరెంపీ అర్నాద్ అడుగుపెట్టాడు. అడుగుపెట్టీ పెట్టగానే... కంపాస్‌ను చూసి – అందరి ముఖాలూ చూస్తూ 'అదీ అసలు సంగతి' అంటూ ఎనౌన్స్ చేశాడు. అంతటితో ఆగకుండా హాలంతా కలయ దున్నేస్తూ –

'ఇక్కడ కిటికీ వుండకూడదు – డోరుండాలి. ఈ డోరున్నచోట గోడుండాలి. ఈ గోడను కొట్టేసి...' ఏదో అనబోతున్న అర్నాద్ చెవులకు 'నీ గోరీ కట్టాలి' అనే డైలాగ్ విన్పించడంతో గతుక్కుమని పళ్లన్నీ బయటపెట్టి – పిచ్చినవ్వు నవ్వుతూ – ఆహా .. ఏం వాస్తు.. ఏంవాస్తు... అంటూ 'మొగుడ్స్ పెళ్లామ్స్'లో డాన్స్ చేస్తున్న 'మొగుళ్లా' అష్టవంకరలు తిరగేస్తుంటే –



## ఇలియానా జపం

వలస పక్షుల్లా వచ్చి వాలే కొత్త హీరోయిన్లు జనాన్ని ఆకర్షించేందుకు నానా తంటాలే పడుతుంటారు. కానీ గోవా నుంచి వచ్చి ఈ సుందరి ఒక్కుదుటన తెలుగు సినీ అభిమానుల మనసును కొల్లగొట్టింది. ఎత్తుకు దగిన బరువు, వొడ్డు వాలుపొడవులు పెట్టనికోటల్లా చేసుకుని, ఇండస్ట్రీలోకి వచ్చీరాగానే అగ్రహీరోలతో సినిమా అవకాశాలు పొందింది. ఇప్పుడేమో తన అందచందాలతో యువకుల పెదాలపై తన పేరు నర్తించేలా చేసుకుంది. 'దేవదాసు' సినిమా ద్వారా పరిచయమై 'పోకిరి'తో సంచలనం రేపింది. చాలామంది నిర్మాతలు ఇప్పటికే ఇలియానా కాల్షీట్లు అడుగుతున్నారని కూడా వాదన. కన్నె వయసు అందాలను కనువిందు చేస్తున్న ఈ గోవా డ్రీమ్‌గాళ్ అంటే ఇప్పుడు తెలుగు సినీ అభిమానులకు భలే ఆనందం!

'ఇంటి అద్దెనే కిస్తులు కిస్తులుగా కట్టే నువ్వొక వాస్తు విద్వాన్‌వి' అంటూ స్టేట్‌మెంట్ రూపంలో చెప్పి గుబుక్‌మనే శబ్దం వచ్చేలా ఒక్క గుద్దు గుద్దింది బామ్మ.

నెక్ట్స్ సీనేంటో తెలిసిపోయి – థియేటర్ బయటికి పారిపోతున్న పిచ్చి అభిమాన ప్రేక్షకుడిలా – మోగని సెల్‌తీసి చెవికానించుకుంటూ 'వచ్చె... వచ్చె' అంటూ చల్లగా జారిపోయాడు – ఆరెంపీ కం వాస్తు విద్వాన్ అర్నాద్.

గడియారం పన్నెండు కొట్టింది. సునామీ అలలు సముద్రంలోకి వెళ్లిపోయినట్లు – ఎవరి పోర్షన్‌కి వార్లెళ్లిపోయారు.

***

మలయాళ కుట్టి మాయో? పసరుకున్న పవరో? మాత్రలకున్న మహత్తో? మొత్తానికి మత్తులోకి జారిపోయాడు ఆనంద రావ్! మాటలేవీ ... అతని బుర్రలోకి ఎక్కవని రూఢి చేసుకుని 'బామ్మగారూ! మీరుగాని .. ఆరోజున గాని.. ఆ చిట్కా గాని చెప్పుండకపోతే... ఈపాటికి నా మాంగల్యం ఏమయ్యుండేదో!' అంటూ అల తననో కృష్ణుడి లెవెల్‌కి తీసుకెళ్లినందుకు – మహానందభరితురాలైన బామ్మ అనుకోకుండా ఓ ఆనంద బాష్పాన్ని రాల్చేస్తుంటే ... ఆ నీటిబొట్టులోంచి 'ఫ్లాష్‌బ్యాక్' తన్నుకొచ్చేసింది... ఇద్దరికీ ఒక్కసారిగా!

''అమ్మాయ్! మనిషన్నాక... అప్పుడప్పుడూ ఏ జలుబో, జ్వరమో వస్తుండాలి. పదేళ్లుగా మీరు నా యింట్లోనే వుంటున్నారు. నీకైతే ఆ రెండూ అప్పుడప్పుడు వస్తున్నాయి గానీ .. ఆనంద్రావుకు అవేమీ వచ్చిన దాఖలాలు లేవు. ఇలా అయితే చెప్పాపెట్టకుండా ఏ హార్టెటాకో, కేన్సరో వచ్చే అవకాశముందని.. మొన్నీమధ్యే ఏదో వారపత్రికలో చదివాను' అంటూ చిద్విలాసంగా సలహాను సరఫరా చేస్తున్న బామ్మ ముఖాన్నే బేలగా చూస్తూ –

'మరైతే .. దీనికి చిట్కానే లేదా? బామ్మగారూ!' అంటూ తన టి.వి. నెక్లెస్‌ను ఐమీన్ టెర్మరిక్ వెర్మిలాస్ నెక్‌లెస్‌ను కళ్లకద్దుకుంది, అతి దీనంగా ముఖంపెట్టి 'అల'.

జోడు పదవుల యవ్వారాన్నే ఝాడించి తన్నిన శ్రీమతి సోనియాగాంధీ వారసులం మనం! శతకోటి దరిద్రాలకు అనంతకోటి అతిదరిద్రమైన ఉపాయాలుంటాయి. నువ్వేమీ వర్రీగాకు అంటూ ఓ దరిద్ర చిట్కాను రహస్యంగా చెవిలో ఊదేసింది బామ్మ.

దాని ఫలితమే ఆదమరిచి నిద్రపోతున్న ఆనంద

రావ్ చంకల్లో ఉల్లిపాయల్ని ప్లాంట్ చేయడం. ఆ రాత్రే అనుకోకుండా ఆనందరావుకు జ్వరం రావడం 'హండ్రెడ్' అంటూ అల అలా గావుకేక పెట్టడం.

ఫ్లాష్‌బేక్ ఎండైపోయింది!

***

భళ్లున తెల్లారిపోయింది.

ఆనందరావు జ్వరం 'ఇన్‌ఫోసిస్' వస్తుందనే వార్తతో షూటప్ అయిపోయిన శంషాబాద్ ల్యాండ్ రేట్‌లా చకచకా పాకిపోయి నూట్నాలుగు' దగ్గర ఆగిపోయింది.

కళ్లు కూడా తెరవలేక, అతి దీనమైన పరిస్థితిలో వున్న ఆనందరావును 'వష్టేపోవ్' హాస్పిటల్లో జాయిన్ చేయించేసింది సిస్టర్ మేరీ క్యూరీ. ఖాళీగా వున్న అంబులెన్స్‌ను చూసి టెంప్టైపోయిన ఆడా మగా అందరూ ఎక్కేశారు... బామ్మ, అలలతో పాటు.

మేరీక్యూరీ ఇన్‌ఫ్లూయెన్స్... ఆర్ హాస్పిటల్ ఆన వాయితీనో అంబులెన్స్ ఆగీఆగ్గానే అక్కడో 'ఎమర్జన్సీ అట్మాస్ఫియర్' క్రియేటైపోయింది!

బలిసిన బఫెలో లెవెల్లో వున్న డైరెక్టర్ సారీ.. 'డాక్టర్ పి.పి.యా' ఆధ్వర్యంలో అదేదో సినిమాలో సీన్‌లా అన్పించింది – అనంతలక్ష్మికి!

ఆనందరావును ... ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లి పోయార్ డెట్టాల్ వాసనతో 'ఘుమఘుమలాడే' నాలుగు స్పూన్ల కాఫీని అతికష్టంమీద దిగమింగి రిలాక్స్ అయిపోయారు మిగిలినవాళ్లు.

అరగంట అలా భారంగా గడిచిపోయింది. అప్పుడొచ్చాడు 'డాక్టర్ పందికుంట పెంటయ్య' అనే పేరును పి.పి.యాగా మార్చుకున్న ఇస్పెష లిస్ట్ – ఓ యాభై కంప్యూటర్ ప్రింటవుట్స్‌ను పోల వరం ఫైళ్లంత జాగ్రత్తగా పట్టుకుని.

వస్తూనే వాలకాన్నీ – ఏజ్ గ్రూపును బట్టి.. మిసెస్ ఆనందరావును కనిపెట్టేసి – 'మేడం! మీరేగా... మిసెస్ ఆనందరావ్?' హైపిచ్‌లో అడిస రికి... చైర్లో కూర్చొని తన ఇమేజినేషన్లో కన్పిస్తున్న దేవుళ్లందరికీ మొక్కులు మొక్కేస్తున్న అల అదిరి పడి లేచి 'హౌనండీ!' అంది.

'మీరేం వర్రీగాకున్రి. ఆనందరావ్ సాబ్‌కు అన్నీ చేయించినం... ఈసీజీ – బీసీజీ – బ్లడ్ టెస్ట్ – త్రెడ్ టెస్ట్ – మడ్‌టెస్ట్– రెడ్‌టెస్ట్ – ఇంకేంది? ఆ... యాంజియోగ్రాం – రేడియోగ్రాం – విడి యోగ్రాం.. ఆడియోగ్రాం .. సుత చేయించినం.'

'బీ.పీ. టెస్ట్ చేయించినం.. ఏం లే' ... 'టీబీ టెస్ట్ చేయించినం... ఏంలే' –

'ఐ టెస్ట్ చేసినం ... ఏం లే' – 'ఇయర్ టెస్ట్ చేసినం ... ఏంలే–'

'లంగ్ టెస్ట్.. ఫంగస్ టెస్ట్ కూడా చేసినం.. ఏంలే'–

'బ్రైన్ స్కాన్ చేయించినం... ఏంలే' –

గంతా నార్మల్.. నీ పెనిమిటి మస్తున్నడు! ఇగో... ఈ బిల్స్ తీసుకెల్లి .. గా పోరున్న తాన కట్టేసి.. మీ ఆయన్ని తోల్కపొన్రి'' అంటూ ఆ బిల్సన్నీ అల చేతిలో కుక్కేసి .. అదృశ్యమైపో యాడు డాక్టర్ పి.పి.యా..

అందరి సాయంతో ... అన్ని పేజీలూ వెదికితే... ఆఖర్న దర్శనం యిచ్చింది .. అద్భుతమైన ఫిగర్ 'ముప్పై తొమ్మిది వేల తొమ్మిదొందల తొంభై తొమ్మిది.'

ఆ ఫిగర్ చూస్తూనే కరివేపాకును కొత్తిమీరను కూడా బేరాలాడే అల .. అలల్లా కమ్మేసిన షాక్‌కు తట్టుకోలేక 'బామ్మా! నీ ఉచిత సలహా – ఉచిత విద్యుత్ పథకంలా ఇంత చేస్తుందనుకోలేదు' అను కుంటూ – అప్పుడె డెట్టాల్‌తో క్లీన్‌చేసిన ఆ నీట్ ఫ్లోర్‌మీద స్పృహతప్పి దబ్‌మంటూ పడిపో యింది. అంతే ఆ సీన్‌కోసమే ఎదురుచూస్తున్న పి.పి.యా.. మళ్లీ ప్రత్యక్షమైపోయి... మరింత 'ఎమర్జెన్సీ అట్మాస్ఫియర్ని' క్రియేట్ చేశాడు. శవం చుట్టూ మూగే రాబంధువుల్లా కమ్మేశారు స్టాఫ్.

***

భయంకరంగా రాత్రైపోయింది.

ఆనందరావ్ క్రెడిట్ కార్డులోంచి ... యాభై రెండువేల... తొమ్మిదొందల డేష్ – డేష్ – అదృశ్య మైపోయింది.

'వ్యూహం వికటించి 'మూడో టెస్ట్‌మేచ్' తన్నేస్తే డీలాపడిపోయిన చాపెల్లా – ఇక జీవితంలో ఎవ రికీ – ఎట్టి క్లిష్టపరిస్థితుల్లోనూ – చిట్కాలు సల హాలు ఇవ్వకూడదనే తత్కాల్ నిర్ణయాన్ని తక్షణం తీసేసుకుంది బామ్మ – సుందరమ్మ!

ఇంత కాలానికి చిక్కావు 'ఆనంతరావూ!' అను కుంటూ అంబులెన్స్ బెడ్‌కు అంటుకుపోయిన ఆనందరావును చూస్తూ హాయిగా నిట్టూర్చింది మలయాళ కుట్టి .. మేరీ క్యూరీ.

అయ్యో! పొరపాటైపోయింది. క్షమించం డంటూ దారిపొడుగునా కలవరిస్తూనే వుంది 'అల'.

★

